
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 2 । మే । 2025



సోమశిలలో 51.114 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారానికి 51.114 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ వివిధ కాలువలకు 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.96,420
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా):	రూ.8,795
మూడు శాతం జీఎస్టీతో :	రూ.9,059
నవర (8 గ్రాములు)	:రూ.72,472



వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. గురువారం గాలిలో తేమ 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

4న జిల్లా సీనియర్ టీ-20 క్రికెట్ జట్టు ఎంపికలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఈ నెల 4వ తేదీన ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ స్టేడియంలోని క్రికెట్ ప్రాంగణంలో నెల్లూరు జిల్లా సీనియర్ టీ -20 క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కేఎస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సొంత క్రీడా కిట్లతో ఆధార్‌కార్డుతో ఉదయం 8 గంటలకు హాజరు కావాలని సూచించారు.

ఎల్టీ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు (అర్బన్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న 7 ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులకు ఇటీవల దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ వి.సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. spsnellore.ap.gov.in/ notice/ recruitment వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. అభ్యర్థులు పరిశీలించుకుని ప్రొవిజనల్ మెరిట్ జాబితాలో ఏమైనా అభ్యంతరాలున్నాయని భావిస్తే తగిన ఆధారాలతో ఈ నెల 8వ తేదీలోపు జిల్లా వైద్యశాఖా కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఆ తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమన్నారు.

రేపు మంత్రి సత్యకుమార్ పర్యటన

నెల్లూరు(అర్బన్): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శుక్రవారం రాత్రి 11 గంటలకు కావలికి చేరుకుని రాత్రికి బస చేస్తారు. శనివారం ఉదయం 9 గంటలకు వింజమూరులో ఏర్పాటు చేసిన కిడ్నీ రోగుల కోసం డయాలిసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. 11.45 గంటలకు నెల్లూరులోని జయభారత్ ఆస్పత్రి కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.15 గంటలకు అల్లీపురం కార్యక్రమాల్లో పాల్గొని, అక్కడి నుంచి 3 గంటలకు పొదలకూరుకు వెళ్లి కిడ్నీ రోగుల కోసం డయాలిసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి రేణిగుంట ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో హైదరాబాద్ చేరుకుంటారు.

93.26 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు (పొగతోట): సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా మొదటి రోజు గురువారం 93.26 శాతం మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. 3,03,602 మంది లబ్ధిదారులకు పింఛను నగదు పంపిణీ చేయాల్సి ఉండగా, 2,83,149 మందికి నగదు అందజేశారు.

పిడుగుతో చెలరేగిన మంటలు



జి.అయ్యవారిపల్లిలో పిడుగు పడి ఇళ్ల మధ్య మంటలు రేగిన

ఉదయగిరి: ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు మండలాలల్లో గురువారం సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ఉదయగిరి మండలం జి.అయ్యవారిపల్లి సమీపంలో పిడుగు పడడంతో విద్యుత్ పరికాలు పూర్తిగా కాలిపోయాయి. దీంతో ఆ ప్రాంతం అంతా మంటలు వ్యాపించాయి. స్థానికులు అప్రమత్తమై తమ పశువులను వేరే ప్రాంతానికి తరలించారు. ప్రాణ నష్టం జరగలేదు. వింజమూరులో కూడా రాత్రి ఉరుములు, మెరుపుల వాతావరణం ఏర్పడింది.

సీఎం సభకు వస్తూ వృద్ధుడి మృతి



ఆత్మకూరు: ఆత్మకూరులో జరిగిన చంద్రబాబు సభకు వస్తూ ఓ వృద్ధుడు కుప్పకూలి మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. వెంకట్రావుపల్లికి చెందిన పెంచలయ్య అలియాస్ వెంకటేశ్వర్లు (65) హెలిప్యాడ్ వద్దకు వెళ్తూ ఎండవేడిమికి తట్టుకోలేక రోడ్డుపై కుప్పకూలాడు. దీంతో సమీపంలోని వారు పరిశీలించి ఓ యువకుడు సీపీఆర్ చేశారు. వెంటనే ఆ వృద్ధుడు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందాడు. పట్టణంలోని ఓ హోటల్‌లో ఇతను పని చేస్తుంటాడు. మృతుడికి భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వాటాల కోసమే వార్నింగ్‌లు



మంత్రులు, ఎమ్మెల్యేల అండతో చెలరేగుతున్న ముఖ్య అనుచరులు

- సహజ వనరుల దోపిడీతో రూ.కోట్లు కూడబెట్టుకుంటున్న వైనం
- స్థానిక ముఖ్య నేతలను పట్టించుకోని పరిస్థితి
- అసహనంతో రగిలిపోయి తిరుగుబాటు
- మొన్న ఎమ్మెల్యే కాకర్ల, తాజాగా నుడా ఛైర్మన్ కోటంరెడ్డి

'మా నియోజకవర్గం నుంచి రూ.కోట్ల విలువైన సహజవనరుల సంపదను కొల్లగొడుతున్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదంటూ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పోలీసులను పురమాయించి గ్రావెల్ రవాణా చేసే వాహనాలను సీజ్ చేయించి కేసులు నమోదు చేయించారు. నెల్లూరు నగర పరిధిలో దీనదయాళ్‌నగర్ ప్రాంతంలో పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. టీడీపీకి చెడ్డ పేరు తెచ్చే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదంటూ నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సుమారు నాలుగు గంటల పాటు నానా హంగామా చేశారు. ఈ ఇద్దరి వార్నింగ్‌ల వెనుక స్వార్థమే కనిపిస్తోంది. స్థానికంగా ఉన్న తమను పట్టించుకోకుండా టీడీపీ నేతలు దోపిడీ చేస్తున్నారనే అక్కసు తప్ప, సహజవనరులను కాపాడే ఉద్దేశం లేదు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల అండతో తమ్ముళ్లు సహజ వనరుల దోపిడీకి తెగబడుతున్నారు. సోమశిల నుంచి ఇందుకూరుపేట వరకు ఉన్న పెన్నానదిలో అడుగడుగునా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. ఇక మిగతా నియోజకవర్గాల్లో గ్రావెల్, మట్టి, ఇసుక, క్వార్ట్జ్ ఖనిజ సంపదను విచ్చలవిడిగా దోపిడీ చేస్తున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, మరి కొన్ని ప్రాంతాల్లో టీడీపీ ముఖ్య నేతలను పట్టించుకోకుండా సాగుతున్న ఈ దోపిడీ దందాపై ఇటీవల వారే అడ్డుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తమకు వాటాలు ఇవ్వకుండానే ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో తరహా దోపిడీ విధానం చూసి తమ్ముళ్లలోనే కడుపు మండి తిరుగుబాటు వరకు వెళ్లారు. ఇటీవల ఉదయగిరిలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన నియోజకవర్గంలో మంత్రి ఆనం అనుచరుడి గ్రావెల్ దందాపై కన్నెర్ర చేయగా, తాజాగా మంత్రి నారాయణ ఇలాకాలో ఆయన ముఖ్య అనుచరుడు ఇసుక దందాపై నుడా ఛైర్మన్ కోటంరెడ్డి హడావుడి చేయడం చూస్తుంటే తమ్ముళ్ల దోపిడీ విధానం చూసి ఛీదరించుకుంటున్నారు. ఈ వార్నింగ్‌లు కేవలం వాటాల కోసమేనా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నేతలే సహజవనరుల దోపిడీని బయట పెట్టినా.. అధికార యంత్రాంగం నెలవారీ మామూళ్లతో కళ్లకు గంతలు కట్టుకుని వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులే సదరు నేతలకు మేలు చేసే విధంగా వ్యవహరిస్తూ మధ్యవర్తిత్వం, కేసులు నమోదు చేయడంలో సహకారాన్ని అందిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

పెన్నానదిని భారీ యంత్రాలతో తోడేస్తూ..

నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని దీన్‌దయాళ్‌నగర్ వద్ద మంత్రి నారాయణ అండతో టీడీపీ నేతలు అనధికారికంగా రీచ్‌ను ప్రారంభించారు. నేరుగా రీచ్ వద్దకే కార్పొరేషన్ నిధులతో రహదారిని ఏర్పాటు చేశారు. ఉచిత ఇసుక విధానం ముసుగేసి పగటి సమయాల్లో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. రాత్రయితే చాలు టీడీపీ నేతలు వారి అనుచర వర్గం యంత్రాలు పెట్టి పెన్నానదిని కుళ్లబొడుస్తున్నారు. నిత్యం 50 భారీ వాహనాలతో ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. అయితే పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న తనను కాదనే మరెవరికో ఇక్కడి ఇసుక అక్రమ రవాణాకు మంత్రి అండగా ఉండడంతో జీర్ణించుకోలేకపోయిన నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దీన్‌దయాళ్ నగర్‌లో జరిగే ఇసుక దోపిడీపై ఇటీవల కన్నెర్ర చేసి అడ్డుకున్నారు. అధికార యంత్రాంగాన్ని అక్కడికి రప్పించుకుని కోటంరెడ్డి హడావుడి చేయడం వెనుక ఆ పార్టీలో జరుగుతున్న అంతర్గత పోరే కారణమని తెలుస్తోంది. పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారంటూ చేసిన రచ్చ వెనుక తనకు వాటాల ఒప్పందమే ఉందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉదయగిరి నుంచి గ్రావెల్, రఫ్‌స్టోన్, క్వార్ట్జ్

ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం మండలం యర్రబొట్లపల్లి, యర్రబల్లి, ఉదయగిరి మండలంలోని ఆర్లపడియ, అప్పసముద్రం, కుర్రపల్లి, సీతారామపురం మండలంలోని సీతారామపురం, వింజమూరు మండలంలోని జనార్దనపురం, చాకలికొండ, గుండెమడకల, బత్తినవారిపల్లి, ఊటుకూరు, వింజమూరు, దుత్తలూరు మండలంలోని కొత్తపేట, బ్రహ్మేశ్వరం, ఏరుకొల్లు, ముత్తరాశిపల్లి, బోడవారిపల్లి, వరికుంటపాడు మండలంలోని రామాపురం, జడదేవి, తూర్పుబోయమడుగుల, కొండాయపాళెం, గువ్వాడి, తదితర గ్రామాల్లో అపారంగా ఉన్న వైట్ క్వార్ట్జ్ సంపదను ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు వాటాలు ముట్టజెప్పి అనుచరులు దోచేస్తున్నారు. దుత్తలూరు మండలం బండకిందపల్లి, వింజమూరు మండలం వెంకటాద్రిపురంలో ఎలాంటి అనుమతులు లేకుండానే కంకర క్రషర్లు ఏర్పాటు చేసి అక్రమంగా విక్రయిస్తున్నారు. వింజమూరు మండలం నల్లగొండ్ల ప్రాంతంలో నాణ్యమైన గ్రావెల్‌తోపాటు, రఫ్ స్టోన్ కూడా లభిస్తోంది. దీన్ని మంత్రి ఆనం ముఖ్య అనుచరుడు ఎమ్మెల్యేతో పనిలేకుండా అక్రమంగా తరలిస్తుండడంతో ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కాకర్ల ఆగ్రహం వ్యక్తం చేసి రవాణా చేసే వాహనాలను పోలీసులను పురమాయించి పట్టించారు. ఈ క్రమంలో మంత్రి ఆనం జోక్యం చేసుకోవడంతో జీర్ణించుకోలేక ఏకంగా కేసులు నమోదు చేయించారు. ఎట్టకేలకు మంత్రి అనుచరుడు స్థానిక ఎమ్మెల్యేతో వాటాల ఒప్పందం కుదుర్చుకోవడంతో వ్యవహారం సద్దుమణిగింది.

ఈఎంఆర్‌ఎస్‌లో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

విడవలూరు (కొడవలూరు): మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్‌ఎస్)లో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈజీ గ్రూపుల్లో చేరుటకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ గురువారం తెలిపారు. ఎంపీసీలో బాలురకు-5, బాలికలకు-15, బైపీసీలో బాలురకు-5, బాలికలకు-22, హెచ్ఈజీలో బాలురకు-5, బాలికలకు-12 సీట్లు వంతున మొత్తం 64 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో 90 శాతం సీట్లను యానాది, ఎరుకుల, సుగాలి, నక్కల తదితర గిరిజన కులాలకు కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన 10 శాతం సీట్లు మాత్రం తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు, దివ్యాంగుల పిల్లలకు కేటాయిస్తామన్నారు. ఈ సీట్లను కౌన్సెలింగ్ నిర్వహించి పదో తరగతిలో మెరిట్ ఆధారంగా భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 30వ తేదీ లోగా చంద్రశేఖరపురంలోని ఈఎంఆర్‌ఎస్‌లో నేరుగా దరఖాస్తు చేయాలని సూచించారు.

7, 8, 9 తరగతుల్లో ఖాళీల భర్తీ

ఈఎంఆర్‌ఎస్‌లో 7, 8, 9 తరగతుల్లో ఖాళీ ఏర్పడిన సీట్ల భర్తీకి చర్యలు తీసుకొంటున్నామని ప్రిన్సిపల్ చెప్పారు. బాలికలకు 7వ తరగతిలో 14, 8వ తరగతిలో 1, 9వ తరగతిలో 3 సీట్లు ఖాళీలున్నాయన్నారు. బాలురకు 7లో 11, 9లో 4 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అడ్మిషన్ల కోసం ఈ నెల 10వ తేదీలోగా ఈఎంఆర్‌ఎస్ పాఠశాలలో దరఖాస్తు చేసుకొంటే 11న రాత పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో చోరీ

బిట్రగుంట: సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళుతున్న 12734 నంబరు నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో గురువారం వేకువన గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శ్రీవెంకటేశ్వరపాళెం స్టేషన్ సమీపంలో సిగ్నల్ లేని కారణంగా రైలు వేగం నెమ్మదించడంతో ఎస్-2, ఎస్-3 కోచ్‌ల్లో నిద్రిస్తున్న ఇద్దరు మహిళా ప్రయాణికుల మెడల్లోని బంగారు చైన్లను గుర్తుతెలియని వ్యక్తులు లాక్కుని ట్రైన్ దిగి పారిపోయారు. ఘటన జరిగిన వెంటనే నెల్లూరు రైల్వే డీఎస్పీ మురళీధర్, రైల్వే సీఐ సుధాకర్, సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని అనుమానితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రెండు గంటల పాటు గాలించినా ఫలితం లేకపోవడంతో సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు.

ఇదే ప్రాంతంలో సిగ్నల్ ట్యాంపర్ చేసి..

గతేడాది జూన్ 12వ తేదీన ఇదే ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు సిగ్నల్ ట్యాంపర్ చేయడం ద్వారా నరసాపురం నుంచి ధర్మవరం వెళ్తున్న ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లో చోరీకి పాల్పడ్డారు. ఎస్-11 కోచ్‌లో ఒక మహిళా ప్రయాణికురాలి బ్యాగును, ఎస్-13 కోచ్‌లో గుడివాడకు చెందిన ప్రయాణికురాలి మెడలోని బంగారు చైన్‌ను దోచుకెళ్లారు. అదే విధంగా షిర్డీ సాయినగర్ నుంచి తిరుపతి వెళ్తున్న తిరుపతి స్పెషల్ ట్రెయిన్‌లో ఎస్-3, ఎస్-5 కోచ్‌లలో ఇద్దరు ప్రయాణికుల నుంచి రెండు బంగారు చైన్‌లను చోరీ చేశారు. తాజాగా మళ్లీ ఇదే ప్రాంతంలో దొంగలు పంజా విసిరి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో చోరీ చేయడంతో రైల్వే పోలీసులు ఉలికి పడ్డారు. ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర ముఠాలతో పాటు మహారాష్ట్రలోని సోలాపూర్, పర్భణి ప్రాంతాలకు చెందిన పార్ధీ, బవారియా గ్యాంగ్‌ల కదలికలపై ఆరా తీస్తున్నారు.

అల్లూరు రోడ్డు ఘటన జరిగిన నెలకే..

అల్లూరు రోడ్డు రైల్వేస్టేషన్ సమీపంలో హోమ్ సిగ్నల్‌ను ట్యాంపర్ చేసి ఏప్రిల్ ఒకటో తేదీ వేకువన గుర్తుతెలియని వ్యక్తులు మదురై ఎక్స్‌ప్రెస్‌లో చోరీకి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై రైల్వే అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్న సమయంలో సరిగ్గా 30 రోజుల తర్వాత శ్రీవెంకటేశ్వరపాళెం స్టేషన్ సమీపంలో దొంగలు మళ్లీ పంజా విసరడం కలకలం సృష్టించింది. అల్లూరు రోడ్డు ఘటనను ఛాలెంజింగ్‌గా తీసుకున్న జీఆర్పీ అధికారులు ప్రత్యేక బృందాల ద్వారా దర్యాప్తు చేస్తున్నారు. ఈ గ్యాంగ్ సభ్యులు సెల్ ఫోన్లు వాడకపోవడం, ప్రతి నేరానికి గ్యాంగ్‌లోని సభ్యులు మారిపోతుండడం, నేరం జరిగిన తర్వాత రోడ్డు మార్గంలో తప్పించుకొని వెళ్తుండటంతో దర్యాప్తులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయినా అధికారులు వెనుకడుగు వేయకుండా కీలక ఆధారాలు సేకరించారు. ఈ క్రమంలోనే శ్రీవెంకటేశ్వరపాళెం వద్ద మళ్లీ చోరీ జరగడంతో దర్యాప్తులో మరింత వేగవంతం చేశారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునఃప్రారంభం

బిట్రగుంట: బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో టికెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను గురువారం పునఃప్రారంభించారు. రైల్వేలోని వివిధ విభాగాల ప్రైవేటీకరణ, ఖర్చులు తగ్గించుకునే ప్రక్రియలో భాగంగా బిట్రగుంటలోని టికెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను రైల్వే అధికారులు గతేడాది తొలగించారు. దీంతో టికెట్ రిజర్వేషన్ కోసం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో రిజర్వేషన్ కౌంటర్‌ను పునఃప్రారంభించాలని బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రయాణికులు, రైల్వే కార్మిక సంఘాలు పలుమార్లు రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేయడంతో ఎట్టకేలకు సానుకూలంగా స్పందించారు. గురువారం నుంచి రిజర్వేషన్ కౌంటర్‌ను పునఃప్రారంభించడంతో ప్రయాణికులకు రిజర్వేషన్ సౌకర్యం మళ్లీ అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా బిట్రగుంట అభివృద్ధి కమిటీ సభ్యులు బాణసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నేలకూలిన ప్రజావేదిక స్వాగత ఆర్చీ ఇనుప స్తంభం



సీఎం సభా ప్రాంగణం ముందు ఏర్పాటు చేసిన స్వాగత తోరణం (గంట ముందు)



ప్రజావేదిక జరిగిన కొద్ది సేపటికే కూలిన స్వాగత తోరణం (గంట తర్వాత)

ఆత్మకూరు: సీఎం చంద్రబాబునాయుడు గురువారం ఆత్మకూరు పర్యటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. సభాస్థలి ప్రజావేదిక వద్ద స్వాగత ఆర్చీకి ఓ వైపు ఏర్పాటు చేసిన ఇనుప స్తంభం నేలకూలింది. అయితే సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లు అయింది. నెల్లూరు-ముంబై రహదారి పక్కనే ప్రజావేదిక ఏర్పాటు చేయడంతో మిట్ట మధ్యాహ్నం వేళ ఆ మార్గంలోని వాహనాలను నిలిపివేయడంతో ప్రయాణికులు ఓ వైపు ఎండ, చెమట్లు కక్కుతూ దాహంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సీఎం మాట్లాడుతుండగా..

మిట్టమధ్యాహ్నం ప్రజావేదికలో సీఎం దాదాపు 1.20 గంటల సేపు మాట్లాడారు. అయితే ఆయన ఉపన్యాసం ప్రారంభించిన అరగంట అనంతరం వెనకాల ఉన్న పలువురు సభ నుంచి వెళ్లిపోయారు. మహిళలు సైతం ఎండకు తట్టుకోలేక వెళ్లిపోయారు. దీంతో సగానికిపైగా కుర్చీలు ఖాళీ అయ్యాయి.

దివ్యాంగుడిని అనుమతించని అధికారులు

పింఛన్ పునరుద్ధరించాలని ఓ దివ్యాంగుడు సీఎం సభావేదిక సభకు వెళ్తుండగా సెక్యూరిటీ అధికారులు నిలిపివేయడంతో ఆవేదన వ్యక్తం చేశాడు. మర్రిపాడు మండలం డీసీపల్లికి చెందిన సుధాకర్ దివ్యాంగుడు. గతంలో ఇతనికి పింఛన్ వస్తుండేది. అయితే వారి కుటుంబంలోని అందరికి కలిపి 10 ఎకరాలకు పైగా భూమి ఉందని పింఛన్‌ను నిలిపివేశాడు. దీంతో సుధాకర్ తన సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు వ్యయ ప్రయాసలకోర్చి మండుటెండలో ప్రజావేదిక సభకు చేరుకున్నాడు. అయితే అక్కడున్న సెక్యూరిటీ, పోలీసులు అతనిని లోపలికి పంపలేదు. అర్జీలు ఇచ్చేందుకు సమీపంలోని మరో కౌంటర్ వద్ద ఉన్న అధికారికి ఇవ్వాలని చెప్పగా తాను ముఖ్యమంత్రికే ఇవ్వాలని సుధాకర్ పట్టుబట్టారు. అయితే పోలీసులు, సెక్యూరిటీ విభాగం అధికారులు అతనిని అక్కడ నుంచి రోడ్డు మీదకు తరలించారు. ఆ దృశ్యాలు చూసిన పలువురు అయ్యో అంటూ విచారం వ్యక్తం చేశారు.



సీఎంకు అర్జీ ఇచ్చేందుకు వెళ్తున్న దివ్యాంగుడిని అడ్డుకుని పక్కకు తీసుకెళ్తున్న పోలీసులు

స్వర్ణాంధ్రప్రదేశ్‌కు సహకరించండి

- సీఎం చంద్రబాబు నాయుడు

ఆత్మకూరు: రాష్ట్ర అభివృద్ధి, స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం ప్రజల సహకారంతోనే సాధ్యమని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. గురువారం ప్రజావేదికలో చంద్రబాబు మాట్లాడుతూ నియోజకవర్గాల్లో పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుందని, ఆ దిశగా ఆలోచన చేసి గడిచిన పది నెలల్లో రూ.8.50 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. అమరావతిని వరల్డ్ క్లాస్ కేపిటల్ సిటీగా రూపుదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలో రూ.లక్ష కోట్లతో బీపీసీఎల్ కంపెనీ, ఇండోసోల్ కంపెనీలు ఏర్పాటు కానున్నాయన్నారు. దగదర్తి ఎయిర్‌పోర్ట్ త్వరలో ఏర్పాటు కానుందని, కృష్ణపట్నం, రామాయపట్నం పోర్ట్‌లు అందుబాటులోకి రానున్నాయని ఆయన తెలిపారు. పారిశ్రామిక ప్రగతికి అవి ఎంతో దోహదపడతాయన్నారు. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సీఎం చంద్రబాబు శాలువా కప్పి సన్మానించారు. మార్గదర్శి, బంగారు కుటుంబం కార్యక్రమంలో దాతలైన మార్గదర్శిలను ఆయన అభినందించి శాలువా కప్పి సన్మానించారు. నెల్లూరుపాళెం గిరిజనకాలనీలో గిరిజన వితంతువు సుస్మితకు పింఛన్ అందజేశారు. సమీపంలోని భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులతో కొద్దిసేపు మాట్లాడారు. తిరుగు ప్రయాణంలో టిడ్కో గృహ సముదాయాల వద్ద ఏర్పాటు చేసిన టీడీపీ కార్యకర్తలతో చర్చించారు.



ఎంఎస్ఎంఈ పార్కు పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు, మంత్రులు

పైలాన్ ఆవిష్కరణ

ఆత్మకూరురూరల్: మండలంలోని నారంపేట వద్ద ఎంఎస్ఎంఈ పార్కు వద్ద సీఎం చంద్రబాబు గురువారం పలువురు మంత్రులు, అధికారులతో కలిసి పైలాన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 11 ఎంఎస్ఎంఈ పార్కులు ప్రారంభోత్సవం, 39 ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపనలను వర్చువల్‌గా నిర్వహించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, టీజీ భరత్, ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి, కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఆత్మకూరు, నెల్లూరు, కందుకూరు ఆర్డీఓలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

చిరుద్యోగులపై కూటమి నేతల కక్ష

ఆత్మకూరు (చేజర్ల): కూటమి నేతలు రాజకీయ కక్షతో చిరుద్యోగుల పొట్టగొడుతున్నారు. చేజర్ల మండలం మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వాచ్‌మెన్ గంగపట్నం చిన్నబ్బయ్య, స్వీపర్ గంగపట్నం పెంచలమ్మను స్థానిక టీడీపీ నేతల ఒత్తిడితో హెచ్ఎం శ్రీనివాసులు గతేడాది ఆగస్టులో అకారణంగా విధుల నుంచి తొలగించారు. బాధితులు హెచ్ఎంను ఇదేమి అన్యాయమంటూ అడగగా గ్రామస్తులు మీపై ఆరోపణలు చేశారని, విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఫిర్యాదు రావడంతో తొలగించినట్లు చెప్పారు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వారి సంజాయిషీ తీసుకొని విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు పేర్కొంది. అయితే హైకోర్టు ఆదేశాలను హెచ్ఎం అమలు చేయకపోగా డీఈఓను సంప్రదించాలని తెలిపారు. దీంతో బాధితులు డీఈఓను సంప్రదించగా ఆయన గ్రామంలోని 'కొందరు' పెద్దలను సంప్రదించాలనడం గమనార్హం. దీనిపై మళ్లీ కోర్టును ఆశ్రయిస్తామనడంతో శుక్రవారం విచారణ నిర్వంచనున్నారు.

8 నుంచి పెంచలకోన బ్రహ్మోత్సవాలు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ప్రచార కరపత్రాలు, పోస్టర్లనును వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీ శ్రీనివాసులరెడ్డి, ఆలయ ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, బ్రహ్మోత్సవాల ఫెస్టివల్ కమిటీ సభ్యులు చెన్ను తిరుపాల్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కొరవడిన ప్రచారం

పెంచలకోనలో జరిగే బ్రహ్మోవాలకు రాష్ట్ర నలుమూల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ముఖ్యంగా నెలూరు, తిరుపతి, చిత్తూరు, ఒంగోలు, వైఎస్సార్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. గతంలో సుమారు 50 రోజుల ముందే పోస్టర్లను ఆయా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో అంటించి ప్రచారం నిర్వహించేవారు. పెంచలకోన దేవస్థానంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించే ఉభయదాతలకు కరపత్రాలు అందించేవారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వంలో పాలక మండలితోపాటు దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు వారం ముందు కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించడం చూస్తే అందరికీ తెలిసేదెలా అని భక్తులు మండి పడుతున్నారు.



బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ఆగి ఉన్న బస్సును ఢీకొన్న బైక్

- తండ్రి, కుమార్తెకు గాయాలు



ఘటనా స్థలంలో మణి

విడవలూరు(కొడవలూరు): ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును మోటార్‌బైక్ ఢీకొట్టగా ఇద్దరు గాయపడిన ఘటన కొడవలూరు మండలంలోని నాయుడుపాళెం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని యల్లాయపాళేనికి చెందిన మల్లిక మణి తన ఎనిమిదేళ్ల కుమార్తె లక్ష్మీతిరుపతమ్మను బైక్‌పై ఎక్కించుకొని కావలి వైపు వెళ్తూ నాయుడుపాళెం వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక వైపు నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో మణికి తీవ్రంగా, లక్ష్మీతిరుపతమ్మ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే మొబైల్ సిబ్బంది నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మణి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారని బంధువులు తెలిపారు. కొడవలూరు పోలీసులకు సమాచారం అందించారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్

వెంకటగిరి రూరల్: వేసవి సెలవులను పురస్కరించుకుని వెంకటగిరి పట్టణంలోని తారక రామా మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు క్యాంప్ జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 99597 22799 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఒక్కొక్కరుగా మీడియా ముందుకు..

- వీరయ్య కేసులో రోజుకొకరు ముందుకొస్తున్న వైనం
- కొనసాగుతున్న విచారణ

ఒంగోలు టౌన్: టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. తొలుత మూడురోజులపాటు ఎటువంటి కదలిక కనిపించని ఈ కేసులో నిందితులు ఉపయోగించినట్లు చెబుతున్న వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్న తర్వాత నుంచి కీలక సమాచారం లభించడంతో వేగం పెరిగింది. అమ్మనబ్రోలుకు చెందిన టీడీపీ యువ నాయకుడిని ప్రధాన అనుమానితుడిగా పోలీసులు నిర్ధారించారు. ఇంకా అమ్మనబ్రోలుకు చెందిన హవాలా వ్యాపారి పేరు కూడా ప్రముఖంగా తెరపైకి వచ్చింది. హైదరాబాద్‌లో నివాసం ఉండే అతని కోసం పోలీసులు గాలిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఒంగోలు నగరం కొప్పోలులోని ఓ పాఠశాల సమీపంలో ఉంటున్న మరో వ్యక్తి హత్యలో ప్రధానపాత్ర పోషించినట్లు పోలీసులు చెబుతున్నారు. అతను హత్య జరిగిన రోజు రాత్రే వైజాగ్ పారిపోయినట్లు చెబుతున్న పోలీసులు.. అప్పటి నుంచి అక్కడే తిష్టవేసి గాలిస్తున్నారు. గత నెల 22వ తేదీ హత్య జరగ్గా, నేటికి పది రోజులు దాటిపోయాయి. అయినప్పటికీ కేసు మాత్రం ఇంకా కొలిక్కి రాలేదు. రెండు రోజుల క్రితం నెల్లూరు నుంచి ఇద్దరు అనుమానితులను తీసుకొచ్చి విచారిస్తున్నారు. వీరు హత్యలో నేరుగా పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా, ఈ కేసుకు సంబంధించి మూడు రోజులుగా పలు నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధాన అనుమానితులుగా చెప్పుకుంటున్న వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు ఒక్కొక్కరిగా మీడియా ముందుకు వస్తుండటం చర్చనీయాంశంగా మారింది.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 117
లేయర్ (లైవ్) : 100
బ్రాయిలర్ చికెన్ : 212
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 232
లేయర్ చికెన్ : 170



పొదలకూరు నిమ్మధరలు(కిలో)

పెద్దవి	: రూ.95
సన్నవి	: రూ.65
పండ్లు	: రూ.40



పామాయిల్ మాఫియా బరితెగింపు

హైవే వెంబడి అనధికార కొనుగోలు కేంద్రాలు

- నిత్యం రూ.లక్షల్లో అక్రమ వ్యాపారం
- చోరీ కేసులో సూత్రధారిని తప్పించి పాత్రధారులను ఇరికించారు
- మామూళ్ల మత్తులో పట్టించుకోని పోలీసులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో పామాయిల్ మాఫియా బరితెగిస్తోంది. కొందరు లారీ డ్రైవర్ల వద్ద తక్కువ ధరకు ఆయిల్ కొనుగోలు చేస్తూ అక్రమంగా వ్యాపారం చేస్తుండగా, మరికొందరు ఏకంగా ట్యాంకర్లనే మాయం చేస్తున్నారు. కృష్ణపట్నం పోర్టుకు సమీపంలో రహదారి వెంబడి పామాయిల్, సన్‌ఫ్లవర్, బిస్కెట్ తదితర ఆయిల్ కంపెనీలు పదుల సంఖ్యలో ఉన్నాయి. వీటి నుంచి నిత్యం వందల సంఖ్యలో ట్యాంకర్ల ద్వారా రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటుగా ఇతర రాష్ట్రాలకు ఆయిల్ విక్రయాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు మండలాల పరిధిలో కృష్ణపట్నం పోర్టు రహదారి, జాతీయ రహదారి వెంబడి అనధికార ఆయిల్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయిల్ దందా కొనసాగిస్తున్నారు. ముత్తుకూరు మండలంలోని పంటపాళెం, వెంకటాచలం మండల పరిధిలోని నాయుడుపాళెం పెట్రోల్ బంక్, మనుబోలు మండల పరిధిలోని గురువిందపూడి రోడ్డు, కొండూరుసత్రం తదితర ప్రాంతాల్లో అనధికార కొనుగోలు కేంద్రాలు పెట్టారు. ట్యాంకర్ల డ్రైవర్లతో పరిచయం చేసుకుని వారి ద్వారా పామాయిల్, బిస్కెట్ ఆయిల్, సన్‌ఫ్లవర్ తదితర రకాలను 50 లీటర్ల క్యాన్లకు పట్టి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.



కాలువలో పామాయిల్ ట్యాంకర్ (ఫైల్)

కాసులు కురిపిస్తూ..

కృష్ణపట్నం పోర్టు రహదారి వెంబడి సాగే ఆయిల్ అక్రమ దందా నిర్వాహకులకు కాసులు కురిపిస్తోంది. ముత్తుకూరు, వెంకటాచలం, మనుబోలు మూడు మండలాల పరిధిలో నిత్యం రూ.లక్షల్లో వ్యాపారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓ టీడీపీ నాయకుడు నాయుడుపాళెం పెట్రోల్ బంక్ వద్ద నిత్యం వందల లీటర్ల పామాయిల్ తక్కువ ధరకు కొనుగోలు చేయించి సొమ్ము చేసుకుంటున్నాడనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ తంతుకు ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్వాహకులు పోలీసులకు నెలనెలా మామూళ్లు ఇస్తున్నట్లు సమాచారం. ట్యాంకర్ల నుంచి కొనుగోలు చేసిన ఆయిల్‌ను హోటళ్లు, బిస్కెట్ల తయారీ కేంద్రాలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. పామాయిల్ వ్యాపారం కాసులు కురిపిస్తుండటంతో కొందరు ఏకంగా రూ.43 లక్షల విలువ చేసే పామాయిల్‌ను స్వాహా చేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి పోలీసుల విచారణలో దొరికిపోయారు. అయితే ఈ కేసులో రాజకీయ జోక్యం కారణంగా సూత్రధారులను తప్పించారనే ఆరోపణలున్నాయి. వెంకటాచలంలో టీడీపీ కీలక నాయకుడు కావడంతో ఆయన్ను తప్పించారని తెలిసింది. అధికార పార్టీ పరువు పోతుందని స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సూత్రధారుడి పేరు తొలగించి పాత్రధారులను ఇరికించారని తెలుస్తోంది.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు సమీపంలో ఉన్న పాడుబడిన బిల్డింగ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నారు. కొన్నేళ్ల నుంచి ఇదే ప్రాంతంలో తిరుగుతున్న వ్యక్తిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి

మనుబోలు: మండలంలోని మనుబోలు సీఎం నగర్ గిరిజన కాలనీకి చెందిన పెళ్లకూరు అంకయ్య (89) వడదెబ్బకు గురై గురువారం మృతిచెందాడు. అంకయ్య తన భార్య పాపమ్మతో కలిసి రేకుల ఇంట్లో ఉంటున్నాడు. పింఛన్ నగదుతో జీవనం సాగిస్తున్నారు. ఎండల తీవ్రతకు అస్వస్థతకు గురైన అంకయ్యను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో చనిపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని పాపమ్మ కోరుతుంది.

కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ

- జిల్లా కార్యాలయంలో ఘనంగా మేడే

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కార్మికులకు వైఎస్సార్‌సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని ఆ పార్టీ నేతలు తెలిపారు. వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.జయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం మేడేను ఘనంగా నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు మేరిగ మురళీధర్, మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఆనం విజయకుమార్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కార్మిక వర్గాల ప్రయోజనాల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. ఆటో డ్రైవర్లు, నాయీ బ్రాహ్మణులు, చేనేతలు, మత్స్యకారులు, టైలర్లు తదితరులకు ఆర్థిక సాయం చేశారని తెలిపారు. మహిళల కోసం పలు పథకాలు ప్రవేశపెట్టి ఆర్థిక తోడ్పాటునిచ్చారన్నారు. ఆరోగ్యశ్రీలో అనే వ్యాధులను చేర్చి కార్మికులకు అండగా నిలిచారన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో అత్యుత్తమ వైద్యం అందేలా నాడు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో కార్మికుల సమస్యలపై ఐక్యంగా పోరాడుతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నేతలు

డివైడర్‌ను ఢీకొన్న కారు

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం
- మహిళకు స్వల్ప గాయాలు

విడవలూరు(కొడవలూరు): కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం పక్కనే ఉన్న స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఆరుగురిలో ఓ మహిళ స్వల్పంగా గాయపడింది. మిగిలిన వారు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన కొడవలూరు మండలంలోని రాచర్లపాడు వద్ద గురువారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. కావలిలో జరిగే వివాహానికి నెల్లూరు నుంచి ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు బయలుదేరారు. రాచర్లపాడు వద్ద డ్రైవర్ కునుకు తీయడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన మహిళను హైవే మొబైల్ సిబ్బంది సహకారంతో ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.



ఘటనా స్థలంలో కారు, బాధితులు

రైలు ఢీకొని..

- గుర్తుతెలియని మహిళ మృతి

నెల్లూరు సిటీ: రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. నెల్లూరులోని సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని మహిళ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. ఆమె తీవ్రంగా గాయపడి మృతిచెందింది. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వయసు సుమారు 40 సంవత్సరాలు ఉండొచ్చని భావిస్తున్నారు. తెలుపు, నలుపు రంగు టాప్, నలుపు రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 45.243 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 45.243 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్ రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 160, పిన్నేరు కాలువకు 100, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ పోటీలు



క్యాంప్ ఫైర్‌లో పాల్గొన్న విద్యార్థినులు



వివిధ రాష్ట్రాల క్రీడాకారులతో వీసీ శ్రీనివాసరావు తదితరులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు రెండో రోజైన గురువారం ఉత్సాహంగా సాగాయి. ఉదయం 6.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మ్యాచ్‌లను నిర్వహించారు. వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత తదితరులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. రెండో రోజు 19 మ్యాచ్‌లు జరిగాయి.

సందడే సందడి

టోర్నమెంట్‌లో భాగంగా గురువారం రాత్రి వీఎస్‌యూ క్రీడా ప్రాంగణంలో క్యాంప్ ఫైర్ ఏర్పాటు చేశారు. ఇందులో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారు నృత్యాలు చేశారు.

మూగజీవాలకు అండగా..

- వేసవి నేపథ్యంలో తాగునీటికి ఏర్పాట్లు
- వేల రూపాయలతో నీటితొట్టెల నిర్మాణం
- మానవత్వం చాటుకుంటున్న పంచాయతీ కార్యదర్శి

ఆత్మకూరు: ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. వేసవి తాపానికి మనుషులే అల్లాడిపోతున్నారు. ఇక మూగజీవాలైతే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దాహార్తిని తీర్చుకునేందుకు ఊర్లలోకి వస్తున్నాయి. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాలకు గురై చనిపోతుంటాయి. ఈ నేపథ్యంలో జీవాలకు నీరందించేందుకు ఓ మహిళా ఉద్యోగిని సొంత నిధులు ఖర్చు చేస్తూ మానవత్వం చాటుకుంటున్నారు.

ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడులో గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న డి.శ్రీలత అడవి జంతువుల దాహం తీర్చేందుకు ముంబై రహదారి పక్కన అటవీ ప్రాంతంలో నీటితొట్లు కట్టించారు. సొంత నిధులతో 2019 నుంచి మండలంలోని అనేకచోట్ల తొట్లను కట్టించి నీటి సౌకర్యం కల్పించారు. ఇటీవల మరో ఐదు నీటితొట్టెల్ని రూ.30 వేలతో కట్టించారు. ఒక్కో దాని నిర్మాణం కోసం సుమారు రూ.6 వేలు ఖర్చు చేశారు. తొట్టెల్లో ట్రాక్టర్ ట్యాంకర్ ద్వారా నీరు నింపడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. వారానికోమారు అన్ని తొట్టెల్లో నీరు నింపేలా అద్దెకు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం నెలకు రూ.5 వేలు నుంచి రూ.6 వేలు ఖర్చు చేస్తున్నారు. ఆమె సేవలను గుర్తించిన పలువురు అభినందిస్తున్నారు.



ట్యాంకర్ ద్వారా నీరు నింపుతూ..

అందరి బాధ్యత

"తాగునీటి కోసం మూగజీవాలు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురై చనిపోతుంటాయి. జీవాలను మనం కాకపోతే మరెవరు రక్షిస్తారు. జంతువుల రక్షణ మనందరి బాధ్యత. ప్రతిఒక్కరూ చేతనైనంత సేవ చేయాలి.

– శ్రీలత, పంచాయతీ కార్యదర్శి



ఎర్ర జెండాలు చేతపట్టి.. మేడే ప్రదర్శన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నెల్లూరు బోసుబొమ్మ సెంటర్ నుంచి ట్రంకురోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. నాయకులు, కార్మికులు ఎరుపు రంగు దుస్తులు ధరించి, అరుణ పతాకాలు చేతపట్టి ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలోని చాలీచాలని వేతనాలతో కష్టజీవులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలు, హక్కులను రద్దు చేసి వాటి స్థానంలో లేబర్ కోడ్ అమల్లోకి తీసుకొచ్చి కార్మికుల పొట్ట కొడుతూ బడా పారిశ్రామికవేత్తల కడుపు నింపుతోందని ఆరోపించారు. పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న హక్కులను మరింత మెరుగుపరచాల్సింది పోయి అందుకు విరుద్ధంగా కేంద్రం వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కార్మికుల జీవనస్థితిని దిగజార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ప్రజల మధ్య విభేదాలు సృష్టించి మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. మేడేను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి కార్మికుడు పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు మూలం రమేష్, నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, అజయ్ కుమార్, రెహానా బేగం, కొండా ప్రసాద్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న నేతలు



నగర వీధుల్లో ర్యాలీ